క్లుప్తంగా

నేటి నుంచి కోటి కుంకుమార్చన

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠంలో ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు సువాసినులతో కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణ అధికారి సీఎస్‌ఆర్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిట్టల కిరణమ్మయితో లలితా సహస్రనామ ప్రవచనం ఉంటుందన్నారు. 30వ తేదీ ఉదయం 9గంట నుంచి శ్రీలలితా హోమం , 11గంటలకు లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం 12.30 గంటలకు నీరాజన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. అర్చన కోసం కుంకుమను మఠం వారు అందుబాటులో ఉంచుతారని తెలిపారు. భక్తులు అమ్మవారి పటం, పూజా సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు.

కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారికి వైద్య పరీక్షలు



చిన్నారి మయాంక్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ యోబుతో బొట్టు విష్ణు

కూకట్‌పల్లి: దయార్‌గూడలో నివాసముంటున్న చిన్నారి మయాంక్ వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణు చిన్నారిని రాందేవ్ రావ్ ఆస్పత్రి సీఈఓ డా. యోబుకు చూపించారు. ఆయన పర్యవేక్షణలో మయాంక్‌కు చికిత్స చేయించారు.

ఉచిత ఉపాధి శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ సంస్థ మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణా కేంద్రం ద్వారా పలు రంగాల్లో ఉచితంగా శిక్షణ అందజేస్తున్నారు. బుధవారం సంస్థను ఎస్‌ఐడీబీఐ అధికారులు సీనియర్ ప్రైవేట్ సెక్రటరీ రామకృష్ణ, డాక్టర్ శివకుమార్ అసిస్టెంట్ మేనేజర్, ఎస్ఎస్ఆర్ఎఫ్ డైరెక్టర్ డా. ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకురాలు అరుంధతితో పాటు 16 మంది శిక్షణ పొందే మహిళలు పాల్గొన్నారు. ఈ ఉపాధి శిక్షణా తరగతులను ఎస్‌ఐడీబీఐ సంస్థవారి ఆర్థిక సహాయంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కుట్టు శిక్షణా కేంద్రం పరిశీలన

మోతీనగర్: పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మహిళలు మంచిగా శిక్షణ పొంది తమ కాళ్లమీద నిలబడాలన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, రేవతి, పర్వీన్ సుల్తానా, శేఖర్ పాల్గొన్నారు.

'అల్బెండజోల్ ' మాత్రల పంపిణీ

బాలానగర్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాలానగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 'అల్బెండజోల్ 'మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చందర్ తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ మాత్రలు ఇవ్వనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా మాత్రలు వేయాలని తెలిపారు. బాల, బాలికలను ఆరోగ్యంగా ఉంచేందుకు సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

లయన్ డా. బాబూరావుకు ఘన స్వాగతం

మోతీనగర్: అమెరికాలోని బోస్టన్ సిటీలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అంతర్జాతీయ డైరెక్టర్గా లయన్ డా. ఘట్టమనేని బాబూరావు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఆయన నగరానికి తిరిగి వచ్చిన సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శాఖ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో లయన్ అన్నెం కోటిరెడ్డి, ఓబుల్ రెడ్డి, తిరుపతిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్రం, సంస్కృత భాషల బోధనలకు ఒక్కొక్కరు, కంప్యూటర్ సైన్స్ కోసం ఇద్దరిని నియామనం చేయనున్నట్లు ఆయన తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం ఉత్తీర్ణత) ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీజీతో పాటు ఎన్‌ఈటీ/ఎస్ఎల్ఈటీ/ఎస్ఈటీ/పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ఈ నెల 25న ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.



శిథిలం.. ఉద్యోగుల్లో భయం భయం

- శిథిలావస్థలో బేగంపేట ఆర్ అండ్ బీ క్వార్టర్స్
- చిట్టడవిని తలపిస్తోన్న క్వార్టర్స్ పరిసరాలు
- సగానికి పైగా ఖాళీ, కొత్తగా చేరేందుకు జంకుతున్న ఉద్యోగులు

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్ నిర్వహణ అధ్వాన్నంగా మారింది. అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థ, వెలగని వీధిదీపాలు, విషసర్పాల సంచారం.. క్వార్టర్స్ చుట్టూ అడవులను తలపించే రీతిలో చెట్ల పొదలతో అడవిని తలపిస్తోంది. వర్షం పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారి భయానక వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు బేగంపేట్ పాటిగడ్డ ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌లో ఉద్యోగులు.

నిర్వహణ లోపం కారణంగా..

వివిధ శాఖల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఆవాసం కోసం గత 50 ఏళ్ల క్రితం బేగంపేట్ పాటిగడ్డలో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించింది. మొదటి విడతగా 252 క్వార్టర్స్, పదేళ్ల తర్వాత రెండో విడతగా మరో 252 క్వార్టర్స్ నిర్మాణం చేశారు. అధికారుల కేటగిరీల వారీగా ఏ, బీ, సీ, డీ టైపు క్వార్టర్స్ నిర్మాణం జరిగింది. సచివాలయం నుంచి వచ్చే ఆర్డర్స్ మేరకు ఉద్యోగులకు ఇక్కడ కేటాయింపులు జరుపుతారు. వారి వేతనాలను బట్టి హెచ్‌ఆర్‌ఏ కోత విధిస్తారు. ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో నిర్మాణాలు జరిపిన నేపథ్యంలో ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌గా పిలుస్తూ వచ్చారు. వీటి నిర్వహణనూ ఆర్ అండ్ బీకే అప్పగించారు. క్వార్టర్స్‌కు సంబంధించి ఏదైనా పనులు చేయాలంటే ఉద్యోగులు ముందుగా అప్పీలు పెట్టుకుంటారు. ఆ మేరకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అప్పీలు తాలుకూ పనులు ఎప్పుడు చేస్తారో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఉద్యోగులే గత్యంతరం లేక పనులు చేయించుకుంటున్నారు.

భయంతో ఖాళీ చేస్తున్నారు..

ఇక్కడ నిర్వహణ సరిగా లేక భయంతో చాలా మంది ఉద్యోగులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ముఖ్యంగా పాత క్వార్టర్స్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను అలాగే వదిలేయడంతో గుబురుగా చెట్లు పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. ఇదే ఆసరాగా చేసుకుని పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పచ్చిమొక్కలు, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో పాముల సంచారం ఎక్కువైంది. వర్షం పడితే చిత్తడిగా మారిన రోడ్లపై ప్రయాణం నరకకూపంగా మారింది. ఆర్ అండ్ బీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు నిర్మించుకున్న ఇళ్లకు అసలు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏకంగా రోడ్ల మీదకే వదులుతున్నారు. దీంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించడం నిత్యకృత్యమే. క్వార్టర్స్‌లో సైతం ఎప్పుడో 50 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లే ఉండడంతో ఇళ్ల నివాసితులకు ఎప్పుడూ డ్రైనేజీ జాం అయ్యి ముప్పుతిప్పలు పెడుతోంది. మురికికూపంలోనే సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడి క్వార్టర్స్‌ను చూస్తే అసలు నగరంలో ఉన్నామా.. లేక అడవిలో ఉన్నామా? అనే అనుమానం వస్తుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిట్టడివిని తలపించేలా..



శిథిలావస్థ ఆర్ అండ్ బీ క్వార్టర్స్

వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి



ఆదిత్యనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో నిలిచిన వర్షపు నీరు తొలగించే పనిని బుధవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లపై నీరు నిల్వకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ఎత్తు పెరుగుతుందన్నారు. దానికి తగ్గట్టుగా డ్రైనేజీలని నిర్మించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని నాలాలు, డ్రైనేజీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజాఆరోగ్య విభాగం అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే విధంగా కాలనీ, బస్తీల్లో ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయం వద్ద నివసించే సుహాసిని గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. చికిత్స అనంతరం కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో మంజూరైన రూ.60వేల చెక్కు విడుదల అయ్యింది. బుధవారం గొట్టిముక్కల వెంకటేశ్వరరావు బాధితురాలు సుహాసినికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, వెంకటేశ్వరరావు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సీతక్కను కలిసిన ఓయూ విద్యార్థులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు హైకోర్టు న్యాయవాదుల సంఘం సీనియర్ కార్యవర్గ సభ్యులు నాగులూరి కృష్ణ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ములుగు ఎమ్మెల్యే సీతక్కను ఆమె నివాసంలో కలిశారు. అధిక ఫీజుల పెంపు, హాస్టల్ సమస్యలు, సెలబస్ పూర్తి కాకుండానే పరీక్షల నిర్వహణతో పెరుగుతున్న ఒత్తిడి, విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను సీతక్కకు వివరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఓయూ అధికారులు పట్టించుకోవడం లేదని ఓయూలో పర్యటించి వాస్తవ పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీతక్కను కోరారు.

బాలుడి అదృశ్యం



సాయిచరణ్ (ఫైల్)

మోతీనగర్: బాలుడు అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జనగాం జిల్లా, దేవరుప్పుల గ్రామానికి చెందిన మద్యవేణి ఈశ్వరి బతుకుదెరువు నిమిత్తం ఆరేళ్ల క్రితం సఫ్దార్‌నగర్‌కు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. హౌస్ కీపింగ్‌గా పని చేస్తున్న ఆమెకు ఇద్దరు పిల్లలు. కుమారుడు సాయిచరణ్(13) ఈనెల 17వ తేదీన సాయంత్రం 5 గంటలకు పర్వత్‌నగర్‌లోని తన మిత్రులను కలిసి వస్తానని వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన ఈశ్వరి అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపారు.

బేగంపేట ముంపు సమస్యను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్‌దే

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



బ్రాహ్మణవాడీలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: బేగంపేట నివాసితులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని కట్టెలమండిలో రూ.8.50 లక్షలు, బ్రాహ్మణవాడీలో రూ.13 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను మంత్రి ప్రారంభించారు. వికార్‌నగర్‌లో పర్యటించిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను విన్నవించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బ్రాహ్మణవాడీలో అన్ని లైన్‌లలో సీవరేజీ పనులు చేపడుతున్నామని ఇవి పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజలు వరదనీటి ముంపుతో పడుతున్న ఇబ్బందులను మంత్రి కేటీఆర్ చొరవతో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం కింద రూ.45 కోట్ల వ్యయంతో బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని త్వరలోనే పూర్తవుతాయన్నారు. నాలా వెంట ఉన్న కాలనీల్లో కూడా వర్షాకాలంలో నీరు నిలవకుండా సీవరేజీ లైన్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్ల నిర్మిస్తామని ఈ పనులతో వరద ముంపు సమస్య నుంచి ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత విముక్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, మేనేజర్ శశాంక్, శానిటరీ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ సుధీర్ పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు చెక్కు అందజేత



గోపి దంపతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: వెన్నెముల గోపి కులాంతర వివాహం చేసుకున్న సందర్భంగా ఆ దంపతులకు ప్రభుత్వం తరపున 2 లక్షల 50 వేల రూపాయల చెక్కు మంజూరయ్యింది. బుధవారం సదరు చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి అందజేశారు. అన్ని కులాలు, మతాల వారిని సమన్యాయంతో చూసే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

ఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఎస్ఐ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సబ్ ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి తోటి సిబ్బంది అందించిన 10 లక్షల చెక్కును సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బుధవారం అందించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ దుండిగల్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి జూన్ 8వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. 2014 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి గతంలో ధారూర్, యాలాల్, తాండూర్, కొడంగల్ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కూతురు అక్షయ ఉన్నారు. మేడ్చల్ డీసీపీ సందీప్ ఆధ్వర్యంలో జోన్ పోలీస్ సిబ్బంది తమ వంతు సాయంగా రూ.10 లక్షలు జమ చేసి ప్రభాకర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న, తల్లిరమాదేవి, తండ్రి సాగర్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ సందీప్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసిన ప్రేమకుమార్



కూకట్‌పల్లి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, సామాజిక వేత్త, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ బుధవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో చేరేందుకు ఆయనతో ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ కోకన్వీనర్ రాజు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలి



వర్షంలోనే రోడ్డుపై విద్యార్థుల భైఠాయింపు

లాలాపేట: సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలంటూ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులంతా రోడ్డెక్కారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వందలాది మంది విద్యార్థులు లేడీస్ హాస్టల్ వద్ద దాదాపు 4 గంటల పాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓ వైపు సెలబస్ పూర్తి కాకుండానే ఆగస్టు 16న జరగాల్సిన పీజీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలను ముందస్తుగా ఈ నెల 28 నుంచి పరీక్షలను ఏర్పాటు చేస్తే పరీక్షలు ఎలా రాస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఓయూ అధికారులు హడావుడిగా పరీక్షలు పెట్టి విద్యార్థులపై మానసిక ఒత్తిడికి కారణం అవుతున్నారని వాపోతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న వారిని అంబర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల మేలుకోసమే విద్యా సంవత్సరం నష్టపోకుండా పరీక్షల షెడ్యూల్ ముందుగానే ప్రకటించామన్నారు. పరీక్షలు యథాతథంగా సాగుతాయని విద్యార్థులంతా హాజరు కావాలన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

లాలాపేట: రాష్ట్రం సాధించుకుని తొమ్మిదేళ్లు గడుస్తున్నా సరైన ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలామని పలువురు కళాకారులు బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ సాంస్కృతిక శాఖ ద్వారా తనకు నచ్చిన వారికే ఉద్యోగాలు ఇచ్చారని అందులో కళాకారులుగా అర్హత లేని వారు ఉన్నారని ఆరోపించారు. కళాకారుల పేరుతో కేవలం దాదాపుగా 500 మందికి ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఈ విషయమై ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కలిస్తే ఇంకే ఉద్యోగాలంటూ తమను అవమానించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ స్పందించి ఉద్యమ కాలంలోని కళాకారులందరికి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

శివమ్మకాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఆల్విన్‌కాలనీ: గుడ్‌మార్నింగ్ ఆల్విన్‌కాలనీలో భాగంగా బీఆర్ఎస్ యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ బుధవారం శివమ్మ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్ గౌడ్, సిద్దయ్య, షౌకత్ ఆలీ మున్నా, సంగమేష్, కూర్మయ్య, సంతోష్ బిరాదర్, గిరి, నరసింహ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శివమ్మకాలనీలో సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేస్తున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్

'సివిల్ సర్వెంట్ విజయాలు, ఎదురుదెబ్బలు చూపించా'

- 'యాజ్ గుడ్ యాజ్ మై వర్డ్'
- పుస్తక రచయిత రిటైర్డ్ ఐఏఎస్ చంద్రశేఖర్

పంజగుట్ట: 'యాజ్ గుడ్ యాజ్ మై వర్డ్' పుస్తకంలో ఒక సవాలుతో కూడిన ప్రదేశంలో సివిల్ సర్వెంట్ విజయాలు, ఎదురుదెబ్బలు చూపించానని భారత ప్రభుత్వ మాజీ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ కె.ఎం.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో చంద్రశేఖర్ రచించిన యాజ్ గుడ్ యాజ్ మై వర్డ్ అనే పుస్తకం నుంచి ప్రేరణ పొందిన పాలనపై ఆలోచనాత్మకమైన ప్యానెల్ చర్చను నిర్వహించారు. కార్యక్రమానికి కె.ఎం.చంద్రశేఖర్, రిటైర్డ్ ఐఏఎస్, కేంద్ర మాజీ హోం సెక్రటరీ, ఆస్కీ చైర్మన్ పద్మనాభయ్య, మాజీ జాతీయ చైల్డ్ ప్రొటెక్షన్, చైల్డ్ రైట్స్ చైర్మన్ శాంత సిన్హా, ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ జయప్రకాష్ నారాయణలు పాల్గొన్నారు. కె.పద్మనాభయ్య మాట్లాడుతూ... తన హయాంలో మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ విధానాన్ని విజయవంతంగా అమలు చేశామని, ఇది వివిధ ప్రభుత్వ రంగ సంస్థల మలుపునకు ఎంతో దోహదపడిందన్నారు. డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ... రాజకీయాల్లో డబ్బు, అధికారం ప్రభావాన్ని పరిష్కరించడానికి సంస్కరింపబడిన ఎన్నికల వ్యవస్థ అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యం, సివిల్ సర్వెంట్ల పాత్రను అన్వేషించే పుస్తక సారాంశాన్ని డాక్టర్ శాంతాసినా చదివి వినిపించారు.

దుర్మార్గపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరో ఉద్యమం

తెలంగాణ అమరుల ఆశయ సాధన జేఏసీ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీందర్ నాయక్

పంజగుట్ట: రాష్ట్రంలోని అమరుల కుటుంబాలను, ఉద్యమ కారులను అందరినీ ఐక్యం చేసి ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని అంతమొందించేందుకు మరో ఉద్యమం చేస్తామని తెలంగాణ అమరుల ఆశయ సాధన జేఏసీ పేర్కొంది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌లు మాట్లాడుతూ... గత 9 సంవత్సరాలుగా తెలంగాణలో అమరుల ఆత్మఘోష వినేపరిస్థితి కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కావాలని రాష్ట్రంలోని సకలజనులు పోరాడితే కేసీఆర్ తానే నాయకుడిని అని చెప్పుకుని కుటుంబ పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ నిజమైన ఉద్యమకారులైతే సెక్యూరిటీ లేకుండా రాష్ట్రంలోని ఏదైనా గ్రామానికి వెళ్లి తిరిగే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ కాపలా కుక్కలా ఉంటానని, అవినీతిచేస్తే రాళ్లతో కొట్టండి అని అన్నారని గుర్తుచేస్తూ ఇప్పుడు రాళ్లతో కొట్టే సమయం ఆసన్నమయ్యిందన్నారు. త్వరలో ఉమ్మడి 9 జిలాల్లో బహిరంగ సభలు ఏర్పాటు చేసి అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను ఐక్యం చేసి చలో హైదరాబాద్ నిర్వహిస్తామన్నారు. ఎస్.యాదగిరి, కె.వి.ప్రతాప్, బింగి రాములు, రాంరెడ్డి, మురళీధర్ దేశ్‌పాండే, శ్రీనివాస్, దప్పు స్వామి, సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

రాయదుర్గం: స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా టీ వర్క్స్‌తో డస్సాల్ట్ సిస్టమ్స్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ–వర్క్స్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. టీవర్క్స్ సీఈ ఓ, తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ మాట్లాడుతూ స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి డస్సాల్ట్ సిస్టమ్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడంతో 3డి ఎక్స్‌పీరియన్స్ వర్క్స్ వంటి సరికొత్త సాంకేతికతలతో కేంద్రాన్ని మరింత సన్నద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు.

కార్ కేర్ స్టూడియోలు

సాక్షి సిటీబ్యూరో: అత్యాధునిక కార్లకు సంబంధించిన సేవలకు పేరొందిన చికాగో కంపెనీ టర్టెల్ వ్యాక్స్, ఇంక్ నగరంలో తమ బ్రాండెడ్ కార్ కేర్ స్టూడియోలను ఏర్పాటు చేసింది. నగరానికి చెందిన జెనెక్స్, ఇండియన్ డెకార్స్‌తో కలిసి నెలకొల్పిన వీటిని బుధవారం ప్రారంభించారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్, బంజారాహిల్స్‌లో వీటి సేవలు అందుబాటులోకి తెస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కలినరీ రీట్రీట్

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో భారీగా రూఫ్ టాప్‌బార్, రెస్టారెంట్‌ను కలినరీ రీట్రీట్ పేరిట బుధవారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ రూపేష్ సాగర్ మాట్లాడుతూ పరిపూర్ణమైన డైనింగ్ డెస్టినేషన్‌ను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆసియా, పాశ్చాత్య వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు. హెడ్ చెఫ్ నవీన్‌సింగ్, మిక్సాలజిస్ట్ సాయిరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఉచితంగా విద్య, వైద్యం'

పంజగుట్ట: తమ పార్టీ అధికారంలోకి రాగానే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ కండువా, కరపత్రాన్ని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, అడ్వైజర్‌లు చిత్ర, సూర్యప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వాసుదేవరావుతో కలిసి ఆవిష్కరించారు.